సాక్షి
రంగారెడ్డి

మంగళవారం । 19 । మార్చి । 2024



కడ్తాల్: హాల్‌టికెట్ నంబర్ సరిచూసుకుంటున్న విద్యార్థులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : మంగళవారం (సాయంత్రం) 6:32

సహర్ : బుధవారం (ఉదయం) 4:59



షాబాద్: పరీక్ష రాసేందుకు ఆలస్యమవుతుందని పరుగులు తీస్తున్న విద్యార్థినులు

99.55%

- పదో తరగతి తొలి పరీక్షకు 72,877 మంది హాజరు
- ఐదు నిమిషాలు ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతి

సాక్షి, సిటీబ్యూరో: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలకు నిర్దేశించిన సమయానికి చేరుకునేందుకు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఉరుకులు పరుగులు తీశారు. తొలి పరీక్ష కావడంతో విద్యార్థులు కొంత ఆందోళనకు గురికాగా.. పలు కేంద్రాల్లో ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన వారిని సైతం లోనికి అనుమతించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయడంతో జిరాక్స్ కేంద్రాలు మూసి వేశారు. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా పరిధిలో ఎక్కడా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని విద్యా శాఖాధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పరిశీలించగా.. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. నగరంలోని పరీక్ష కేంద్రాలను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. ఖైరతాబాద్‌లోని నిర్మలా ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పరీక్ష కేంద్రం లోనికి వెళ్లే ముందు కలెక్టర్ తన సెల్‌ఫోన్ సెక్యూరిటీ పోలీసులకు అందజేశారు. పోలీసులు తనిఖీ చేసి అనంతరం కేంద్రంలోనికి వెళ్లి పరీక్షల నిర్వహణ సరళిని పరిశీలించారు.

- హైదరాబాద్ జిల్లాలో 99.55 శాతం విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 73,204 విద్యార్థులకు గాను 72,877 మంది హాజరు కాగా.. కేవలం 327 మంది గైర్హాజరయ్యారు.
- రంగారెడ్డి జిల్లా పరిధిలో 166 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 50,935 గాను 50,790 మంది, ప్రైవేటు విద్యార్థుల్లో 84 మందికి గాను 59 మంది హాజరయ్యారు.



హయత్‌నగర్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి

న్యూస్‌రీల్

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కమిటీల నియామకం

తుర్కయంజాల్: తెలంగాణ ఉద్యమకారుల సమస్యలపై పోరాటం చేసి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఉమ్మడి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలు కమిటీలను నియమించినట్లు తెలిపారు. మంచాల మండల అధ్యక్షుడిగా గజ్జి ఐలయ్య యాదవ్, తుర్కయంజాల్ మున్సిపల్ మహిళా అధ్యక్షురాలిగా ఆమనగంటి రాధ, జిల్లా ఉపాధ్యక్షుడిగా గుండె రవీందర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కో-కన్వీనర్‌గా బంగారి నర్సింగ్ రావు,జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా తస్నీరు కళాపూర్ణను నియమించినట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెనిగె విష్ణువర్ధన్, రాష్ట్ర కన్వీనర్ కందాల బల్‌దేవ్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుగ్గాని శ్యామల తదితరులు పాల్గొన్నారు.

హస్తం గూటికి డీసీసీబీ చైర్మన్?



కొత్తకుర్మ సత్తయ్య

యాచారం: డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య హస్తం గూటికి చేరనున్నారు. ఆయనతో పాటు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన కొత్తకుర్మ సత్తయ్య మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉన్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరేలా తాండూరు ఎమ్మెల్యే, డీసీసీబీ మాజీ చైర్మన్ మనోహర్‌రెడ్డి చక్రం తిప్పారు. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం సత్తయ్య కాంగ్రెస్‌లో చేరిక విషయమై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో చర్చించి లైన్ క్లియర్ చేసుకున్నారు. గాంధీభవన్‌లో బుధవారం మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నారు. ఆయనతో పాటు యాచారం మండలం నందివనపర్తికి చెందిన బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి హస్తం పార్టీలో చేరనున్నారు. వీరితోపాటు ఇద్దరు డీసీసీబీ డైరెక్టర్లు, నియోజకవర్గంలోని 20 మంది బీఆర్ఎస్ ముఖ్యులతో పాటు పది మంది ఎంపీటీసీ సభ్యులు, ఇద్దరు మాజీ జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు అదే బాటలో నడవనున్నట్లు సమాచారం.

బీమా.. కల్పించండి ధీమా

భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు

- సభ్యత్వం తీసుకున్న వారికి ఆర్థిక చేయూత
- అవగాహన కల్పించడంలో అధికారుల అలసత్వం
- అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు కోలుకోలేని విధంగా నష్టం



నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

కొత్తూరు: భారీ నిర్మాణాల్లో పనులు చేసే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఉమ్మడి రాష్ట్రంలో 2019లో అప్పటి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసింది. బోర్డులో సభ్యత్వం తీసుకున్న కార్మికులకు బీమా సౌకర్యాన్ని అమలు చేసింది. సభ్యత్వం పొంది బీమా తీసుకున్న కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందినా, అంగవైకల్యానికి గురైనా ఆర్థికంగా ఆదుకుంటుంది. సభ్యత్వం పొందిన కార్మికుల ఇంట్లో శుభకార్యాలకు సైతం ఈ పథకం ద్వారా ఆర్థికసాయం అందుతుంది. సంబంధిత శాఖలకు చెందిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా చాలామంది స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు బీమా, సభ్యత్వానికి దూరంగా ఉన్నారు. క్షేత్రస్థాయిలో వారికి అవగాహన కల్పించాల్సిన అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో ప్రమాదాలకు గురైనప్పటికీ కార్మికులు ప్రభుత్వ సాయానికి నోచుకోవడం లేదు.

అవగాహన లేక దూరం

ప్రస్తుతం జిల్లా పరిధి చాలా వరకు హైదరాబాద్ నగరానికి ఆనుకుని ఉంది. దీంతో భారీ కట్టడాలు, పెద్ద భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ స్థానికులతో పాటు ఒడిశా, బీహార్, ఉత్తరప్రదేశ్, ఇతర రాష్ట్రాలకు చెందిన వేలమంది కార్మికులు పని చేస్తున్నారు. వారిలో సగం మందికి మాత్రమే బోర్డు సభ్యత్వం, గుర్తింపు కార్డులు, బీమా సౌకర్యం ఉన్నాయి. భవన నిర్మాణ బోర్డు పరిధిలోకి వచ్చే కార్మికులకు బీమా, ఇతర సౌకర్యాలపై అవగాహన కల్పించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో అనుకోని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు కార్మికులు అన్ని విధాలా నష్టపోతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులకు చట్టాలపై సరైన అవగాహన లేకపోవడం.. మరికొన్ని చోట్ల కాంట్రాక్టర్లు వారిని మభ్యపెడుతుండడంతో పథకానికి దూరంగా ఉంటున్నారు.

సభ్యత్వం ఇలా పొందాలి..

స్థానిక, స్థానికేతరులైన తాపీమేస్త్రీలు, కూలీలు, నిర్మాణరంగంలో పనిచేసే వారు భవన నిర్మాణ కార్మికుల పరిధిలోకి వస్తారు. తాము పనిచేసే నిర్మాణరంగ సంస్థ ఇచ్చిన గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డుతో కార్మికశాఖలో భవన నిర్మాణ కార్మికుడిగా నమోదు చేసుకోవాలి. అన్ని వివరాలు సక్రమంగా ఉంటే వారికి కార్మిక శాఖ గుర్తింపుకార్డు జారీ చేస్తుంది.

బీమాతో ప్రయోజనాలు

- కార్మికశాఖ జారీ చేసిన గుర్తింపుకార్డు, బీమా పరిమితి గడువు ఐదేళ్ల వరకు ఉంటుంది.
- ప్రతి ఐదేళ్లకోసారి బోర్డు నిర్దేశించిన కొద్దిపాటి డబ్బులు చెల్లించి గుర్తింపుకార్డు, బీమా రెన్యూవల్ చేయించుకోవాలి.
- బీమా పొందిన కార్మికుడు సహజ మరణం పొందితే బాధిత కుటుంబానికి రూ.1.30 లక్షలు, నిర్మాణ సమయంలో మృతి చెందితే వారి కుటుంబానికి రూ.5 లక్షల నుంచి రూ.6లక్షల వరకు పరిహారాన్ని ప్రభుత్వం అందిస్తుంది.
- ప్రమాదాల్లో శాశ్వత అంగవైకల్యం పొందితే రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం పొందొచ్చు.
- స్వల్ప గాయాలతో ఆస్పత్రుల్లో చేరితే మూడు నెలల వరకు నెలకు రూ.4,500 వరకు సాయం అందుతుంది.
- బోర్డులో సభ్యత్వం పొందిన కార్మికుల ఇళ్లలో జరిగే పెళ్లిళ్లకు రూ.30 వేలు అందుకునే వీలుంది.
- మహిళా కార్మికులకు ప్రసవాల కోసం రూ.30 వేల ఆర్థికసాయం ఉంటుంది.

ఆర్థికసాయం అందింది



గత 20 ఏళ్లుగా తాపీమేస్త్రీగా కొత్తూరుతో పాటు ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నాను. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డులో సభ్యత్వం, బీమా తీసుకున్నాను. ఇటీవల నా కూతురి వివాహం నిమిత్తం బోర్డు నుంచి రూ.30 వేల ఆర్థికసాయం అందింది.

– ఇస్తారి, తాపీమేస్త్రీ, కొత్తూరు

సభ్యత్వం తీసుకోవాలి



నిర్మాణరంగంలో పనిచేసే వారు తప్పనిసరి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో సభ్యత్వం పొందాలి. ప్రభుత్వం నుంచి అందే బీమాతో ఆర్థికంగా భరోసా ఉంటుంది. అనుకోని ప్రమాదాలు జరిగితే బాధిత కుటుంబాలను బోర్డు ద్వారా ఆదుకుంటుంది.

– కర్రొళ్ల నర్సింహ, భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు, కొత్తూరు

అవగాహన కల్పించాలి



నిర్మాణరంగంలో పనిచేసే ప్రతి కార్మికుడు బోర్డులో సభ్యత్వం పొందేలా కార్మికశాఖ అధికారులు అవగాహన కల్పించాలి. తరచూ ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ నిర్మాణంగంలో పనిచేసే కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవాలి.

– పానుగంటి పర్వతాలు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు

లైన్ క్లియర్



- బుద్వేల్, మోకిల లేఅవుట్ల అభివృద్ధికి మోక్షం
- రూ.420 కోట్లతో టెండర్లు దక్కించుకున్న ఎన్‌సీసీ
- రహదారులు, డ్రైనేజీ, పార్కులు తదితర వసతుల కల్పన
- వేగం పుంజుకోనున్న పనులు

సాక్షి, సిటీబ్యూరో: బుద్వేల్, మోకిల లేఅవుట్ అభివృద్ధికి మార్గం సుగమమైంది. ఇక్కడ మౌలిక సదుపాయాలకు కల్పించేందుకు ఎన్‌సీసీ సంస్థ టెండర్లు దక్కించుకుంది. ఇదిలా ఉండగా, లేఅవుట్‌ల అభివృద్ధికి హెచ్‌ఎండీఏ బిడ్లు ఆహ్వానించగా.. మొత్తం ఆరు సంస్థలు పోటీపడ్డాయి. రెండుచోట్ల మౌలిక సదుపాయాల కల్పనకు సుమారు రూ.420 కోట్లతో ఎన్‌సీసీ టెండర్లు దక్కించుకుంది. దీంతో మోకిల, బుద్వేల్‌లో త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. అయితే, గత ఏడాదే ఈ రెండు లేఅవుట్లను అభివృద్ధి చేయాల్సి ఉండగా.. వివిధ కారణాలతో తీవ్ర జాప్యమైంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలోనూ అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఈక్రమంలో ప్రస్తుత ప్రభుత్వం ఈ రెండు లేఅవుట్‌లను అభివృద్ధి చేసేందుకు గత నెలలో అనుమతిచ్చింది.

నాడు కోకాపేట.. నేడు ఇక్కడ...

బుద్వేల్‌లో రూ.354 కోట్లు, మోకిలలో రూ.47 కోట్లతో అభివృద్ధి చేసేందుకు హెచ్‌ఎండీఏ టెండర్లు ఆహ్వానించింది. పోటీకి వచ్చిన సంస్థల్లో రెండు లేఅవుట్లలో రూ.420 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ఎన్‌సీసీ ముందుకొచ్చింది. గతంలో కోకాపేట్‌లోని నియో పోలిస్ లేఅవుట్లలోనూ ఎన్‌సీసీ ఆధ్వర్యంలోనే అభివృద్ధి పనులు జరగడం గమనార్హం. తాజాగా అదే సంస్థ ఇక్కడ టెండర్లను దక్కించుకుంది. ఈ రెండుచోట్ల త్వరలో పనులు ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు.

ప్రజల నుంచి భారీ స్పందన..

మోకిల లేఅవుట్‌లో రెండు దశల్లో మొత్తం 346 ప్లాట్లను హెచ్‌ఎండీఏ ఆన్‌లైన్ ద్వారా విక్రయించింది. దీంతో ఈ ప్లాట్లపై రూ.716.39 కోట్ల ఆదాయం లభించింది. గరిష్ఠంగా గజానికి రూ.64,000, కనిష్ఠంగా రూ.49,000 ధర పలికింది. రెండు దశల్లో మొత్తం 1,13,325 చదరపు గజాల స్థలాన్ని గత సంవత్సరం విక్రయించింది. ఈ స్థలాలపై రూ.280.95 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకోగా.. అనూహ్యంగా రూ.716.38 కోట్లు లభించింది. మోకిల హెచ్‌ఎండీఏ లేఅవుట్.. కోకాపేట్ నియో పోలీస్ లేఅవుట్ దగ్గరలో ఉండడం, ఔటర్ రింగ్ రోడ్డుకు, శంషాబాద్ విమానాశ్రయానికి అందుబాటులో ఉండటంతో ఇక్కడ ప్లాట్లు కొనుగోలుకు ప్రజలు భారీ ఎత్తున పోటీపడ్డారు. ఈక్రమంలో బహుళ అంతస్తుల భవనాలు, హైరైజ్ బిల్డింగ్‌లు నిర్మించేందుకు హెచ్‌ఎండీఏ అనుమతులు సైతం ఇచ్చింది.

బుద్వేల్.. హాట్‌కేక్

బుద్వేల్‌లో హెచ్‌ఎండీఏకు ఉన్న భూముల్లో వంద ఎకరాలు విక్రయించింది. ఫార్చ్యూన్-500 కంపెనీలకు అందుబాటులో ఉండటం, అమేజాన్, మైక్రోసాఫ్ట్, విప్రో, ఐకియా, తదితర సంస్థలకు దగ్గరలో ఉన్న బుద్వేల్ లేఅవుట్ హాట్‌కేక్‌గా మారింది. మొత్తం 14 ప్లాట్లలో ఒక్కో ప్లాట్‌లో కనిష్ఠంగా 3.47 ఎకరాల నుంచి గరిష్ఠంగా 14.33 ఎకరాల వరకు విక్రయాలు జరిగాయి. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఎత్తయిన ప్రదేశంలో ఉన్న ఈ వెంచర్‌లో బహుళ వినియోగ భవనాలకు అనుమతులు లభించాయి. ఐటీ సంస్థలు, రియల్ ఎస్టేట్ వర్గాలే లక్ష్యంగా ఈ వెంచర్ ఏర్పాటు చేయగా.. బహుళ ప్రయోజనాల జోన్ కావడంతో స్పందన సైతం భారీగా లభించింది. బుద్వేల్‌లో ఎకరం గరిష్ఠంగా రూ.41.25 కోట్ల చొప్పున అమ్ముడైంది. సగటున ఎకరం రూ.36.25 కోట్ల చొప్పున విక్రయించగా.. బుద్వేల్‌లోని మొత్తం 100.01 ఎకరాలకు సంబంధించి రూ.3,625.73 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి లభించింది.

అత్యాధునిక సదుపాయాలు..

ఈ రెండు చోట్ల విశాలమైన రహదారులు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ లైన్‌లు, మంచినీటి పైప్‌లైన్ లాంటి సదుపాయాలు అభివృద్ధి చేయాల్సి ఉంది. అలాగే పార్కుల అభివృద్ధికి కూడా హెచ్‌ఎండీఏ పలుచోట్ల స్థలాలు కేటాయించింది. కాగా, కోకాపేట్ నియో పోలిస్ తరహాలోనే ఈ రెండుచోట్ల వసతులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రధాన రహదారులు 100 నుంచి 60 ఫీట్ల వెడల్పుతో నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. మొత్తంగా రహదారులకు ఇరువైపులా గ్రీనరీ ఏర్పాటుతో పాటు ఆధునికత, ఆహ్లాదం ఉట్టిపడేలా బుద్వేల్, మోకిల లేఅవుట్లు అభివృద్ధి కానున్నాయి.



మంచాల: లింగంపల్లిలో ఓ విగ్రహానికి ముసుగు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

‘కోడ్’ కూసింది.. ముసుగు పడింది

లోక్‌సభ ఎన్నికల నగరా మోగడంతో వెంటనే కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. గోడలపై రాతలను చెరిపివేస్తున్నారు. విగ్రహాలు కనిపించకుండా ముసుగు వేస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు చర్యలు

- పారదర్శకంగా నిర్వహిస్తాం
- ప్రతి ఒక్కరూ సహకరించాలి
- కోడ్ ఉల్లంఘిస్తే కొరడా తప్పదు
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన సందర్భంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ వెలువరించిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి తక్షణమే అమలులోకి వచ్చిందన్నారు. నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్4న కౌంటింగ్ ఉంటాయన్నారు. ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినందున అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ముందస్తుగా అనుమతులు తీసుకుంటే సరిపోతుందన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించకుండా ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలు, ఎంసీఎంసీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. నోడల్ అధికారులను నియమించినట్టు పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘన గురించి ప్రజలు నేరుగా 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. సీ -విజిల్ యాప్ కూడా ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఫిర్యాదు చేసిన రెండు నిమిషాల్లో స్పందిస్తామన్నారు. 85 సంవత్సరాలు పై బడిన వృద్ధులు, దివ్యాంగులైన ఓటర్లు ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు ఉందన్నారు. నోటిఫికేషన్ వెలువడిన ఐదు రోజుల ముందు (ఏప్రిల్ 22వ తేదీ లోపు) 12 డీఫారం భర్తీ చేసి బీఎల్‌ఓకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. తగిన ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు పట్టుకెళ్లొద్దని తెలిపారు. తనిఖీ బృందాలకు సహకరించాలని, కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, శంషాబాద్ ఏసీపీ కేఎస్‌రావు, సీపీఓ సౌమ్య, డీపీఓ సురేష్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక, చిత్రంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు

ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలి

త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా రాజకీయ పార్టీలు కృషి చేయాలని కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం గుర్తింపు పొందిన రాజకీయా పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులకు ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు అనుమతులు సింగల్‌విండో సిస్టం ద్వారా ఇస్తామన్నారు. 48 గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటలకు వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీల్లేదన్నారు. మతం, కులం, ప్రాంతీయ అంశాలను ప్రస్తావిస్తూ విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం నిషేధమన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడడం తగదన్నారు. చర్చిలు, ప్రార్థనా స్థలాల్లో పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రవర్తన నియమాలు పాటించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం



పోషకాహార ప్రాధాన్యతను వివరిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ రోజా

ఐసీడీఎస్ సీడీపీఓ రోజా

కడ్తాల్: పౌష్టికాహారంతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ రోజా అన్నారు. సోమవారం మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండా అంగన్‌వాడీ పాఠశాలలో, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం, అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీఓ రోజా ముఖ్య అతిథిగా హాజరై గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో పోషకాహారం ఏ విధంగా లభిస్తోందో, గర్భిణులకు చిన్నారులకు, తల్లులకు వివరించారు. చిరుధాన్యాల ద్వార ప్రొటీన్స్, విటమిన్స్ కాల్షియం, ఐరన్ లభిస్తాయని, తద్వార చిన్నారుల ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నీలవేణి, మంజుల, కిశోర బాలికలు, విద్యార్థుల తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా ఫరీద్



ఆమనగల్: ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఫరీద్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి నియామక పత్రం అందజేసినట్లు ఫరీద్ తెలిపారు. ఈ సందర్భంగా ఫరీద్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై, ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో చేసిన ఉద్యమాలను గుర్తించి తనను జిల్లా ఎన్‌ఎస్‌యూఐ కార్యదర్శిగా నియమించినందుకు ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డికి, తన నియామకానికి సహకరించిన సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

శంకర్‌పల్లి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్

చేవెళ్ల: ప్రజలు ఆన్‌లైన్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని శంకర్‌పల్లి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ సూచించారు. సోమవారం ఆయన శంకర్‌పల్లి మండల పరిధిలోని మహాలింగపురంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజలు ఆన్‌లైన్ ప్రకటనలు చూసి మోసపోవద్దన్నారు. అధిక వడ్డీలకు డబ్బు ఇచ్చి అప్పు తీసుకున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇది కూడా చట్ట రీత్యా నేరమే అన్నారు. ఇటీవల టంగుటూరు గ్రామంలో రవీందర్ అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో డబ్బు పెట్టించిన తర్వాత యాప్ క్లోజ్ అయింది. దీంతో అందులో పెట్టుబడి పెట్టిన వారి ఒత్తిడి, కొంతమంది డబ్బు డిమాండ్ చేయడంతో పిల్లల్ని చంపి తాను ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే అన్నారు. ప్రజలకు ఇటువంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. లాభాపేక్ష లేకుండా ఎవరూ డబ్బు ఇవ్వరని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



మహాలింగపురంలో అవగాహన కల్పిస్తున్న సీఐ హబీబుల్లాఖాన్

కాశీకి వెళ్తూ.. కానరాని లోకాలకు

- కారు అదుపుతప్పి చెట్టుకు ఢీ
- ఇద్దరి దుర్మరణం
- నలుగురికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో వివరాలను సేకరిస్తున్న పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: కాశీ ప్రయాణికులను రోడ్డు ప్రమాదం వెంటాడింది. కాళభైరవుడి దర్శనం కాకుండానే కానరాని లోకాలకు చేరుకున్నారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలోని బెంగుళూరు జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం, మైసూరులోకి రామకృష్ణా నగర్‌కు చెందిన మిత్రులు బీఎల్ నర్సింహన్ అయ్యర్(47), ఎస్‌కే రత్నాకర(66), విశ్వనాథన్, మదన్‌కుమార్, రఘురాం, శ్రీరాం మారుతీ ఈకో వాహనంలో కాశీ యాత్రకు బయలుదేరారు. మార్గమధ్యంలో షాద్‌నగర్ సమీపంలో వారు కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహన్ అయ్యర్, రత్నాకర ఘటనా స్థలిలో మృతిచెందారు. మరో నలుగురు గాయపడగా మదన్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. విషయాన్ని తెలుసుకున్న ఏఎస్‌ఐ రాంచందర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఆర్కాన్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆస్తి కోసం హత్య..?

భార్య ఫిర్యాదు మేరకు కేసు విచారణ



లింగం(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: కష్టసుఖాల్లో తోడుండాల్సిన వారే కర్కశంగా వ్యవహరించారు. ఆస్తికోసం అయినవారే అంతమొందించారు. తల్లిదండ్రులు, అక్కాబావలు పథకం ప్రకారం హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. భార్య రంగ ప్రవేశంతో పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. ఈ హృదయవిదారక ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్‌లో సోమవారం వెలుగుచూసింది. గ్రామస్తులు, బంధువులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లింగం(32)కు మహేశ్వరం మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన జ్యోతితో నాలుగేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఒక కూతురు సంతానం. అత్తామామ, ఆడపడుచు వేధింపులు తట్టుకోలేక జ్యోతి కూతురుతో కలిసి పుట్టింటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో ఆస్తిపై కన్నేసిన అక్కాబావ భూమిని లింగం తల్లి సత్తమ్మ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. లింగంను తప్పిస్తే ఆస్తి తమకే వస్తుందనే దురాశతో అతన్ని అంతమొందించేందుకు పథకం పన్నారు. తల్లిదండ్రులు, అక్కాబావలు తరుచూ లింగంతో గొడవ పడుతున్నారు. ఆదివారం తల్లిదండ్రులు మరో మారు ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న అక్కాబావ గ్రామానికి చేరుకుని లింగంపై దాడి చేసి హత్య చేశారు. విషయం బయటకు పొక్కకుండా మృతుడి ఇంటి కిటికీకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు గ్రామస్తులను నమ్మించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భర్త మృతిపై జ్యోతి అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి గాయాలను గుర్తించారు. హత్యగా భావించిన వారు తమదైన శైలిలో విచారణ చేపట్టారు. మృతుడి తల్లిదండ్రులను, అక్కాబావలను అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి



భార్గవి(ఫైల్)

ఇబ్రహీంపట్నం: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి మృతి చెందింది. ఈ ఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. దండుమైలారం గ్రామానికి చెందిన ఎం.భార్గవి(19) ఇంట్లోనే మృతి చెందింది. ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

జొమాటో డెలివరీ బాయ్ బ్రెయిన్‌డెడ్

అవయవదానానికి తల్లిదండ్రుల అంగీకారం

సాక్షి, సిటీబ్యూరో: రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓ జొమాటో డెలివరీ బాయ్ 'అవయవదానం'తో మరో ఇద్దరికి ఊపిరి పోశాడు. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని వట్టినాగుల పల్లి గ్రామానికి చెందిన (19) బిశ్వాల్ ప్రభాస్ స్థానిక కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. దీంతోపాటు జొమాటో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీన బిశ్వాల్ యాక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడగా హుటాహుటినా దగ్గర్లోని కాంటినెంటల్ హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు బిశ్వాల్ బ్రెయిన్ డెడ్ అయ్యాడని నిర్ధారించారు. దీంతో డాక్టర్లు అవయవదానం గురించి ప్రభాస్ తల్లిదండ్రులకు వివరించగా వారు ఓ వైపు కొడుకు మరణించాడన్న బాధను దిగమింగుకొని పెద్దమనసుతో అంగీకరించారు. దీంతో డాక్టర్ సెంథిల్ కుమార్ వైద్య బృందం కాంటినెంటల్ హాస్పిటల్‌లోనే ప్రభాస్ నుంచి కాలేయాన్ని సేకరించి సోమవారం మరొకరికి విజయవంతంగా అమర్చారు. అవయవదానంతో ఇతరులకు పున:జన్మనివ్వడం ఎంతో గొప్ప విషయమని కాంటినెంటల్ హాస్పిటల్స్ వైద్య బృందం తెలిపింది. ఈ సందర్భంగా బిశ్వాల్ ప్రభాస్‌కు హాస్పిటల్ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు.

ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి చిన్నారి మృతి

అత్తాపూర్: ప్రమాదవశాత్తు కాలుజారి మూడో అంతస్తు నుంచి కింద పడి తీవ్రంగా గాయపడిన ఓ చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సులేమాన్‌నగర్ చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఇన్‌స్పెక్టర్ జి.వెంకటరామిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సులేమాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఖలీమ్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ముగ్గురు సంతానం.. పెద్ద కుమార్తె ఆనం (3) ఆదివారం సాయంత్రం అపార్ట్‌మెంట్‌లో పిల్లలతో కలిసి ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కింద పడింది. ఆమెను కుటుంబ సభ్యులు నిలోఫర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సోమవారం పోస్టుమార్టం అనంతరం బాలిక మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సబ్సిడీలకు నిధులివ్వండి

- ఎడ్యుకేషన్ లోన్‌ను రూ.60లక్షలకు పెంచాలని వినతి
- నాబార్డ్ సంస్థను కోరిన ఉమ్మడి జిల్లాల డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా



నాబార్డ్ సంస్థ ప్రతినిధులు, డీసీసీబీ డైరెక్టర్‌ల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: సరైన సమయంలో రైతులకు సబ్సిడీలు అందేలా నాబార్డ్ సంస్థ బ్యాంకర్లకు నిధులు అందించాలని ఉమ్మడి జిల్లాల డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా ఆ సంస్థ ఉన్నతాధికారులను కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో నాబార్డ్ ఉన్నతాధికారులు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల డీసీసీబీ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. స్వయం సహకార సంఘాల బ్యాంకుల, రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. కడ్‌తేల్, ఆమనగల్లు మండలాల్లో ఎకరా భూమి విలువ మార్కెట్‌లో రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు పలుకుతోందని సంస్థ ఇచ్చే రూ.1.50లక్షలు సరిపోవడం లేదన్నారు. లాంగ్ టైం(ఎల్‌టీ) రుణాలు రూ.10లక్షల వరకు పెంచాలని కోరారు. ఐదు నుంచి 10 ఎకరాలు ఉన్న రైతులకు రూ.40లక్షల నుంచి రూ.కోటి వరకు రుణాలు ఇవ్వాలని, ఎడ్యుకేషన్ లోన్ డీసీసీబీ నుంచి రూ.60 లక్షలకు పెంచాలని నాబార్డ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సహకార సంఘాల ద్వార ఇచ్చే రుణాలపై పరిమితి విధించడంతో రైతులు ప్రైవేట్ బ్యాంకులను ఆశ్రయించి నష్టపోతున్నారన్నారు. నాబార్డ్ నుంచి అందిచే రుణాలు, సబ్సిడీల చెల్లింపు అమలులో సహకార సంఘాల పాలకవర్గాలను భాగస్వాములను చేయాలని కోరామన్నారు. సబ్సిడీలను త్వరితగతిన అందేలా చూడాలన్నారు. ఇందుకు సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారని, మార్చి చివరిలో ఆర్థిక సంవత్సరంలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని నాబార్డ్ ప్రతినిధులు వెల్లడించినట్లు వివరించారు. ఈ సమావేశంలో నాబార్డ్ సీజీఎం చింతల సుశీల, ఆర్‌బీఐ సీజీఎం ప్రబోటి, సమల్, నాబార్డ్ జీఎం ఉష, డీసీసీబీ చైర్మన్ వెంకటయ్య, సీఈఓ లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లాల డైరెక్టర్‌లు పాల్గొన్నట్లు తెలిపారు.

స్నేహితుడితో కలిసి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

- చెరువు గట్టుపై బాధితుడి చెప్పులు
- గాలింపు చేపట్టిన గజ ఈతగాళ్లు



చెరువు వద్ద శంకర్ నాయక్ బంధువుల పడిగాపులు

మహేశ్వరం: స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి తండాలో సోమవారం వెలుగు చూసింది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన కేతావత్ శంకర్‌నాయక్(38) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి 8గంటల ప్రాంతంలో ఎన్టీఆర్ తండాలో ఉండే స్నేహితుడు బాలు నాయక్ ఇంట్లో చెప్పి బయటకు వెళ్లారు. రాత్రైనా ఇంటికి శంకర్‌నాయక్ ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య, బంధువులు సోమవారం ఉదయం బాలునాయక్‌కు ఫోన్‌చేసి ప్రశ్నించారు. తాము నాగారం గ్రామంలోని ఊరకుంట చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లామని.. బాలు నాయక్ చెరువులోకి దిగి తిరిగి రాలేదని చెప్పాడు. దీంతో బాధితుడి బంధువులు, తండావాసులు నాగారం చెరువు వద్దకు చేరుకుని గజ ఈతగాళ్లతో వెతికినా ఆచూకీ లభ్యమవ్వలేదు. చెరువు గట్టుమీదే చెప్పులు ఉండడంతో బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని బాధితుడి బంధువులు ఆరోపిస్తున్నారు. కాగా పోలీసులు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని.. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామన్నారు.

బీజేపీ జెండా ఎగరడం ఖాయం

చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల గడ్డంపై బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఉప్పర్‌పల్లి సామ భూపాల్‌రెడ్డి గార్డెన్‌లో ఆదివారం అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ విస్తృత కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరై కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని బీజేపీ బలంగా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చి హామీలన్నీ అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలి పెట్టేది లేదన్నారు. బీజేపీ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కలుగుతుందన్నారు. అదే విధంగా చేవెళ్ల పార్లమెంటు బీజేపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని..ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయడానికి కార్యకర్తలు శ్రమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నప్పటికీ.. రాష్ట్రంలో వాటిని అమ లు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ ప్రేమ్ రాజ్, వై.శ్రీధర్, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ మల్లారెడ్డి, బొక్క వేణుగోపాల్, అంజన్ కుమార్, కొమురయ్య, బొక్క బాల్‌రెడ్డి, నంద కిశోర్, బాబురావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జోనల్ స్పోర్ట్స్ మీట్

రాజేంద్రనగర్: పిల్లలను నిత్యం గంట పాటైన ఆటలు ఆడించాలని భాష్యం స్కూల్ సీఈఓ చైతన్య అన్నారు. సోమవారం భాష్యం విద్యా సంస్థల జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ పోటీల్లో అత్తాపూర్ భాష్యం స్కూల్‌కు చెందిన 3, 4,5వ తరగతుల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. అలాగే రన్నింగ్ రేసులో 3వ తరగతి విద్యార్థిని ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. భాష్యం స్కూల్స్ సీఈఓ చైతన్య, జేఈఓ అంకమ్మరావు విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

ఔటర్‌పై కారు బోల్తా

శంషాబాద్: ఔటర్‌పై కారు బోల్తా పడి ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. చిన్నగోల్కొండ సమీపంలో ఔటర్ వద్ద కూకట్‌పల్లి నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

అన్యాయంగా డీటైన్ చేశారు..

- మల్లారెడ్డి యూనివర్సిటీలో అగ్రికల్చర్ విద్యార్థుల ఆందోళన
- మల్లారెడ్డి దిష్టిబొమ్మ దహనం
- విద్యార్థులకు మైనంపల్లి సంఘీభావం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు. తమను అన్యాయంగా డిటైన్ చేశారంటూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, ఎన్‌ఎస్‌యూఐ నేతలతో కలిసి కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. మల్లారెడ్డి, యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమను డిటైన్ చేయకుండా తృతీయ సంవత్సరం చదివేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. కళాశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు ఒకటి,రెండు సబ్జెక్టుల బ్యాక్‌లాక్ ఉన్న విద్యార్థులను కూడా డిటైన్ చేయడం అన్యాయమన్నారు. తమకు న్యాయం చేయాలని పట్టుబట్టారు.

విద్యార్థులకు అండగా ఉంటా: మైనంపల్లి

మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులకు తాను అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. కళాశాల యాజమాన్యం, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అన్యాయం చేసి వారి భవిష్యత్‌తో చెలగాటం ఆడితే ఊరుకునేది లేదని, పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో చదువుతున్న మెదక్ జిల్లాకు చెందిన విద్యార్థులు తన వద్దకు వచ్చి సమస్యను చెప్పడంతో తాను జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని విద్యార్థుల సమస్య పరిష్కారం అయ్యేంత వరకు వారి పక్షాన పోరాడతానన్నారు. మల్లారెడ్డి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాడని, భూములు ఆక్రమించి, అనుమతులు సరిగ్గా లేకుండా విద్యా సంస్థలు నడుపుతున్న మల్లారెడ్డి కళాశాలలపై ఐదేళ్ల పోరాటం కొనసాగిస్తానన్నారు.

నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నాం: డీన్ రాజారెడ్డి

నిబంధనల ప్రకారమే తాము వ్యవహరిస్తున్నామని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ రాజారెడ్డి తెలిపారు. విద్యార్థులు ద్వితీయ సంవత్సరం నుంచి తృతీయ సంవత్సరంలోకి వెళ్లాలంటే మొదటి సంవత్సరం సబ్జెక్టులు పాస్ కావాల్సి ఉంటుందని, ద్వితీయ సంవత్సరం పాస్ కాకున్నా తృతీయ సంవత్సరంలోకి వెళ్లే అవకాశం ఉంటుందని ఈ విషయం పలు మార్లు విద్యార్థులకు తెలిపామన్నారు. మొత్తం 380 మంది విద్యార్థులు ఉండగా 22 మంది విద్యార్థులు మాత్రమే ప్రథమ సంవత్సరం ఉత్తీర్ణులు కాలేదని, రివాల్యూవేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.